క్లుప్తంగా

వీఆర్వోలు, కార్యదర్శులతో సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

కదిరి అర్బన్: ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయశాఖాధికారి సుబ్బారావు పీజీఆర్ఎస్, వర్క్ ఫ్రమ్ హోమ్ కార్యక్రమంపై వీఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీజీఆర్ఎస్ సర్వే రెండు రోజుల లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప, ఏఈ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయండి



వీఎస్ఏలను సన్మానిస్తున్న అధికారులు

ఎన్పీకుంట: అంకితభావంతో పనిచేస్తేనే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని ఏఓ లోకేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని వెలిచలమల, ఎదురుదొన సచివాలయాల్లో గ్రామ సెరికల్చర్ అసిస్టెంట్లుగా పని చేస్తూ పదోన్నతి పొందిన స్వర్ణకుమారి, పి.సున్ను బాషాలను మండల వ్యవసాయ కార్యాలయంలో ఏఓ ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ దేవేంద్ర నాయక్, ఈఓఆర్డీ మాధవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఆంజనేయులు నాయక్ ఇంతియాజ్, యుగంధర్, నరసింహారెడ్డి, ప్రత్యూష,ధనలక్ష్మి, హరినాథ్‌రెడ్డి, సలీం, హరి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గుట్టకిందపల్లి లోనున్న ఏపీ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులున్నాయని, ప్రతి గ్రూపులోనూ 40 సీట్లు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 79811 71568, 77990 04659, 63059 74274 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం రూరల్: మోటుమర్ల వద్దనున్న కేజీబీవీలో ఆరో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎ.చంద్రకళ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపుపై రాయితీ

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీలో ఈ నెల 30 లోపు ఆస్తి పన్ను బకాయిలను ఒకేసారి చెల్లిస్తే 5 శాతం వడ్డీ రాయితీ వర్తింపజేస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సిఫార్సు మేరకే వాడాలి



'పొలంబడి' నిర్వహిస్తున్న వ్యవసాయ సిబ్బంది

ధర్మవరం రూరల్: వ్యవసాయాధికారులు సిఫార్సు చేసిన మేరకు ఎరువులు, పురుగు మందులను వాడాలని రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఆకుతోటపల్లి, చింతలపల్లి గ్రామ పొలాల్లో 'పొలంబడి' కింద సాగు చేసిన వేరుశనగ పంటను వ్యవసాయాధికారులు పరిశీలించారు. వ్యవసాయాధికారి ముస్తఫా మాట్లాడుతూ ఇండి జీఏపీ సర్టిఫికేషన్ (ఉత్తమ వ్యవసాయ యాజమాన్య పద్ధతులు) కోసం శ్రీ బాటమ్మ స్వామి రైతు ఎంఏసీఎస్ లిమిటెడ్ ద్వారా ఏపీఎస్ఓపీసీఏకి నమోదు చేసుకున్న ధర్మవరం డివిజన్‌కు సంబంధించిన 29 మంది రైతుల పొలాలను పరిశీలించామన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహిద్దాం

పుట్టపర్తి టౌన్: దివ్యాంగ విద్యార్థులకు అన్ని రంగాల్లోనూ ప్రోత్సహిద్దామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పిలుపునిచ్చారు. సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో కొత్తచెరువు మండల కేంద్రంలో సత్యసాయి భజన మందిరంలో 227 మంది దివ్యాంగ విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డితో కలసి ఎమ్మెల్యే సింధూరారెడ్డి ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, రోలేటర్లు, బ్రెయిలీ కిట్స్ ఉపకరణాలు పంపిణీ చేశారు.

సాగునీటి పథకాలపై శిక్షణ

బత్తలపల్లి: గ్రామాల్లో చిన్న తరహా సాగునీటి పథకాలను గుర్తించి వాటిని యాప్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని వీఆర్ఓలకు తహసీల్దార్ స్వర్ణలత సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఓలకు 7వ చిన్న తరహా సాగునీటి పథకాల గణనపై శిక్షణ నిర్వహించారు. ఉప గణాంక అధికారి గోపాల్ హాజరై శిక్షణ ఇచ్చారు.



జగన్ హెలికాప్టర్‌ను చూసిన ఆనందంలో అభిమానుల కేరింతలు



పాపిరెడ్డిపల్లి సమీపంలో బారులు తీరిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



నల్లచెరువు మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

దారులన్నీ పాపిరెడ్డిపల్లి వైపే..

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి తరలివెళ్లారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, వివిధ వాహనాల్లో మంగళవారం ఉదయమే బయలుదేరారు. వైఎస్సార్‌సీపీ జెండాలు చేత పట్టి జై జగన్ నినాదాలతో హోరెత్తించారు.

- ఎన్ఎస్ గేట్ నుంచి పాపిరెడ్డిపల్లి వరకూ రహదారులపై బారులు తీరిన వాహనాలు

హెలీప్యాడ్ కిటకిట

పాపిరెడ్డిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు మంగళవారం ఉదయం 10 గంటలకే వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు వైఎస్ జగన్‌కు స్వాగతం పలికేందుకు అక్కడికి చేరుకొన్నారు. హెలీప్యాడ్ చుట్టూ వేసిన ముళ్ల కంచెను సైతం జనం తొలగించుకొని హెలీ క్యాప్టర్ దిగే ప్రాంతానికి దగ్గరగా వెళ్లారు.

రాప్తాడు: నియోజకవర్గంలోని రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లికి మండలం నుంచి వేలాది మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ, మండల కన్వీనర్ సాకే వెంకటేష్, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, మాజీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వేలాదిగా తరలివెళ్లారు. ఉదయం 8 గంటలకు రాప్తాడు నుంచి వెయ్యి బైక్‌లతో ర్యాలీగా పాపిరెడ్డిపల్లి చేరుకున్నారు.

చెన్నేకొత్తపల్లి: రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ రాక సందర్భంగా మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వెళ్లారు. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల్లో వైఎస్సార్‌సీపీ జెండాలతో బయలు దేరి వెళ్లారు.

జనసంద్రంగా మారిన రామగిరి

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక సందర్భంగా రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం జనసంద్రంగా మారింది. పాపిరెడ్డిపల్లి గ్రామంలో టీడీపీ నాయకుల చేతిలో హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు మంగళవారం వైఎస్ జగన్ రామగిరి మండలానికి వచ్చారు. రాప్తాడు నియోజకవర్గంతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. దీంతో చెన్నేకొత్తపల్లి మండలం ఎన్ఎస్ గేట్ నుంచి రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి వరకూ రహదారులన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. అడుగడుగునా పోలీసులు ఆంక్షలు విధిస్తున్నా వాటిన్నింటిని ఛేదించుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చారు.

చేతులెత్తేసిన పోలీసులు

వైఎస్ జగన్‌ను చూసేందుకు హెలీప్యాడ్ వద్దకు భారీగా జనం తరలి వచ్చారు. ఈ సందర్భంలో అక్కడ పోలీస్ భద్రత కూడా తక్కువగా ఉండటంతో వారిని అదుపు చేయలేకపోయారు. దీంతో వైఎస్ జగన్ హెలిక్యాప్టర్ నుంచి కిందకు దిగే సమయానికి జనమంతా ఒక్కసారిగా అక్కడికి వచ్చి బారికేడ్లను తొలగించుకొని హెలీ క్యాప్టర్ చుట్టూ చేరారు. ఈ సందర్భంలో జనాన్ని అదుపుచేయాటానికి పోలీసులు లాఠీచార్జ్ కూడా చేయాల్సి వచ్చింది. అయినప్పటికీ జనం పక్కకు కదలకపోవటంతో సెక్యూరిటీ సిబ్బంది కాన్వాయ్ వాహనాలను హెలీ క్యాప్టర్ వద్దకు తీసుకొని వచ్చి జగన్‌ను అందులోకి ఎక్కించారు. పోలీసుల భద్రతా లోపంతో పాటు భారీగా జనం రావటంతో హెలీప్యాడ్ నుంచి 2 కి.మీ. దూరంలో ఉన్న పాపిరెడ్డిపల్లికి వెళ్లాటానికి జగన్‌కు గంటకు పైగా సమయం పట్టింది.



రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లి నుంచి వెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

నల్లచెరువు: రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ నాయకుల చేతిలో దారుణ హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురుబ లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేసిన సందర్భంగా నల్లచెరువు మండల కన్వీనర్ మొండెం రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాపిరెడ్డి పల్లికి భారీగా తరలి వెళ్లారు.

బత్తలపల్లి: టీడీపీ గూండాల చేతిలో దారుణహత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రావడంతో బత్తలపల్లి మండలం నుంచి దాదాపు 25 వాహనాల్లో పార్టీ నేతలు పాపిరెడ్డిపల్లి గ్రామానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా కురుబ లింగమయ్య ఘాట్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మండల మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డిలతో పాటు పలువురు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పర్యటనలో పోలీసుల ఓవరాక్షన్

- రామగిరి వైపు వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు
- ఎన్ఎస్ గేట్ నుంచి అడుగడుగునా ఆంక్షలు



బారికేడ్లను పోలీసులతో తొలగింపజేసి వాహనాలను పంపుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

సాక్షి, పుట్టపర్తి: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రామగిరి పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి పర్యటన సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీసు యంత్రాంగం అత్యుత్సాహాన్ని ప్రదర్శించింది. టీడీపీ వర్గీయుల చేతిలో దారుణహత్యకు గురైన వైఎస్సార్‌సీపీ నాయకుడు లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పాపిరెడ్డిపల్లికి వచ్చారు. ఈ క్రమంలో జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివస్తారని తెలిసి ఎన్ఎస్‌గేట్ నుంచి రామగిరి వైపు వాహనాలు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఎక్కడి వాహనాలు అక్కడికక్కడే నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. రాప్తాడు, ధర్మవరం మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కాన్వాయ్‌లు కూడా ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వాహనం దిగి పోలీసులతో వారించి అక్కడ బారికేడ్లను తొలగింపచేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేయగా వాహనాలన్నీ రామగిరి వైపు వెళ్లాయి.

గంగంపల్లిలో వైఎస్సార్‌సీపీ వాహనాలపై రాళ్లదాడి

కళ్యాణదుర్గం, కంబదూరు, రామగిరి, కనగానపల్లి మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాపిరెడ్డిపల్లికి చేరుకోవాలంటే నసనకోట మీదుగా వెళ్లాల్సిందే. ఈ నేపథ్యంలో కొందరు టీడీపీ గూండాలు గంగంపల్లి వద్ద రాళ్లతో దాడి చేశారు. దాడిలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అనంతరం పోలీసులు రంగ ప్రవేశంచేసి టీడీపీ శ్రేణులను అక్కడి నుంచి పంపించినట్లు బాధితులు తెలిపారు.



ఎన్ఎస్‌గేట్ నుంచి రామగిరి వైపు వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేసిన పోలీసులు



రాప్తాడు నుంచి బైకుల్లో పాపిరెడ్డిపల్లి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పాపిరెడ్డిపల్లిలో వైఎస్సార్‌సీపీ బత్తలపల్లి మండల నేత బగ్గిరి బయపరెడ్డి, తదితరులు



చెన్నేకొత్తపల్లి నుంచి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ అభిమానులు

నేడు ఫాదర్ ఫెర్రర్ జయంతి వేడుకలు

బత్తలపల్లి: పేదల పెన్నిధి ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రీజనల్ డైరెక్టర్ ప్రమీల తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఫాదర్ ఫెర్రర్ ఘాట్‌ను అందంగా ముస్తాబు చేస్తున్నారు. జయంతిని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాలలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. 'ఇండియా ఫర్ ఇండియా' పేరుతో ఏర్పాటు చేసిన హుండీలను లెక్కించి.. కొత్త హుండీలను అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకుగాను బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో దాదాపు 4వేలు పైచిలుకు హుండీలను లెక్కించనున్నట్లు రీజనల్ డైరెక్టర్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌లు ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం సందేశాలు వినిపిస్తారన్నారు. వివిధ గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు.



బత్తలపల్లిలోని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఘాట్

ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం

ఎన్పీ కుంట: ఎమ్మార్సీ కార్యాలయంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా ఎన్నికైన జి.హరిప్రసాద్‌రెడ్డిని మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల విద్యాశాఖ అధికారి గోపాల్‌నాయక్ మాట్లాడుతూ హరిప్రసాద్‌రెడ్డి సుదీర్ఘకాలంగా ఎస్టీయూలో కొనసాగుతూ ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ ఫ్యాప్టో సభ్య సంఘాలు, ఉపాధ్యాయుల సహకారంతో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ అసోసియేట్ అధ్యక్షులు జవహర్, జిల్లా గౌరవాధ్యక్షులు రామాంజులయాదవ్, రమణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన ఫ్యాప్టో జిల్లా చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి

నాణ్యమైన వైద్య సేవలందించాలి

ధర్మవరం అర్బన్: నాణ్యమైన వైద్యసేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో మంగళవారం 20 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.18,81,558 చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యానికి సంబంధించి అత్యవసర సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు చేస్తుందన్నారు. అనంతరం పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ, ముద్ర రుణాలు, బీసీ కార్పొరేషన్ రుణాలు, తదితర సంక్షేమ అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డీపీసీ జనరల్ మేనేజర్, నియోజకవర్గంలోని అన్ని బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం ప్రారంభం

తాడిమర్రి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రి స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలను అందించడానికి ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తాడిమర్రిలోని ప్రధాన రహదారిలో రోడ్డు విస్తరణలో భాగంగా భూమి కోల్పోయిన బాధితులకు నష్ట పరిహారం అందించి ఆదుకుంటామన్నారు. అంతకు ముందు ఆయన బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం, డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్, తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటరంగారావు, డాక్టర్ హరిత తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులతో మంత్రి సత్యకుమార్

గ్రామ దేవతలకు బోనాలు

బత్తలపల్లి: గ్రామ దేవతలకు మంగళవారం బోనాలు సమర్పించారు. పోట్లమర్రిలోని నల్లమ్మ తల్లిని గ్రామస్తులు పూలతోనూ, ఆభరణాలతో అందంగా అలంకరించారు. ప్రతి ఇంటి నుంచి కొత్త కుండలో చేసిన తీపి అన్నం, నారికేళాలు, పూలను తీసుకుని ఊరేగింపుగా దేవాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ పూజలు అనంతరం గ్రామస్తులు మూగజీవాలను గ్రామ దేవతలకు బలి ఇచ్చారు. గుమ్మల్లకుంటలోనూ భైరవునికి గ్రామస్తులు బోనాలు తీసుకువెళ్లి, జంతుబలులు ఇచ్చారు. గ్రామస్తులు మాట్లాడుతూ ప్రతి యేటా ఉగాది, శ్రీరామనవమి పండుగ మరుసటి దినం గ్రామదేవతలకు బోనాలు తీసుకువచ్చి జంతుబలులు ఇవ్వడం ఆచారంగా కొనసాగుతోందన్నారు. పంటలు పుష్కలంగా పండాలని దేవతలను వేడుకున్నామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో టెంకాయలు, చీనీపండ్లు విసురుతూ పందేలు ఆడి సంతోషంగా గడిపారు.



పోట్లమర్రిలో బోనాలు తీసుకువెళ్తున్న గ్రామస్తులు

అమ్మవారి ఊరేగింపు

అమడగూరు: మండల కేంద్రం అమడగూరులోని చౌడేశ్వరీ అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని 16 గ్రామాల ఊరేగింపులో భాగంగా మంగళవారం బలకవారిపల్లిలో గ్రామస్తులు అమ్మవారి విగ్రహప్రతిమను పల్లకీలో ఘనంగా ఊరేగించారు. ఊరేగింపు తర్వాత అమ్మవారిని శీతిరెడ్డిపల్లికి తరలించారు. తెల్లవారుజామున గంగిరెడ్డిపల్లికి అమ్మవారిని చేర్చారు.

ముగిసిన జాతర ఉత్సవాలు

తలుపుల : సిద్దుగూరిపల్లిలో గల శ్రీశ్రీ బోసు ముత్తాత స్వామి జాతర ఉత్సవాలు మంగళవారం అగ్గిసేవ కార్యక్రమంతో ముగిసినట్లు పూజారి ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

రెండు రోజులే గడువు

అమడగూరు: కేజీబీవీలో ఆరో తరగతిలో ప్రవేశానికి, 7, 8 తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తు చేసుకోవడానికి రెండు రోజులే గడువు ఉన్నట్లు ఎంఈఓ జిలాన్‌బాషా తెలిపారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

గాండ్లపెంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పీఎంశ్రీ కింద రూ.23 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ల్యాబ్ భవనాన్ని సర్వశిక్ష డీఈ చిదంబరం మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్కూల్ కమిటీ చైర్మన్‌ను ఆదేశించారు.

క్రీడాభివృద్ధికి ఆర్డీటీ తోడ్పాటు

కదిరి అర్బన్: ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతిని పురస్కరించుకుని రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ రూ.35 వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు మంగళవారం అందజేశారు.

రేషనలైజేషన్ ఆపాలి

కదిరి అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియెట్ కళాశాలల్లో రేషనలైజేషన్ ప్రక్రియను ఆపాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 430 జూనియర్ లెక్చరర్ పోస్టులను వివిధ కళాశాలల నుంచి షిఫ్టింగ్, కన్వర్షన్ చేశారని ఆరోపించారు. కదిరిలో ఆంగ్లశాస్త్రం, అర్థశాస్త్రం తదతర పోస్టులను వేరే కళాశాలకు బదిలీ చేశారన్నారు. బదిలీ చేసిన పోస్టులను యథావిధిగా అక్కడే ఉంచాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మహేంద్ర, ఫయాజ్, ఫారూక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ సకాలంలో చేయండి

ముదిగుబ్బ: కార్డుదారులకు రేషన్ సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ నాయకులు చల్లా శ్రీనివాసులు, తిప్పయ్య, చిన్నప్ప తదితరులు మాట్లాడుతూ అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం తదితర కారణాలతో మండలంలో రేషన్ సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారిందన్నారు. రేషన్ సరుకుల కోసం కూలీలు పనులు వదులుకొని వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, శంకర, మంగళేశ, తదితరులు పాల్గొన్నారు.